వి - చికిత్స

రాజ్యలక్ష్మి విశ్రాంతిగా పడకకుర్చీలో పడుకొని వారపత్రిక చదువుకొంటూ వుండగా అందులో "మీరు - మీ దేహస్థితి" అన్న పేజీ వచ్చింది.

అది చదువుతున్నకొద్దీ రాజ్యలక్ష్మి ముఖం పాలిపోయింది. కొద్దిరోజులుగా తాను శరీరంలో ఏదో అస్వస్థత ఉన్నట్లు అనుకొంటూ వున్నది అబద్ధం కాలేదని తేలింది. కాని ఆ రోగం యింత భయంకరమైందని మాత్రం ఆమె కలలోకూడా ఊహించలేదు. ఆ పేజీలో కుష్టురోగ లక్షణాలు వివరించబడి వున్నాయి.

రాజ్యలక్ష్మి మోకాలి కింది భాగం గిల్లి చూచుకున్నది. స్పర్శ లేనట్లు గ్రహించింది. ఎడమభుజంపై వుండును పరిశీలించింది. అది వెడల్పుగా పొడలు పొడలుగా మారుతున్నట్లు తెలుసుకున్నది. ఎముకలు కుంచించుకొని పోతున్నట్లు, పెదవులు మొద్దుబారుతున్నట్లూ ఊహించుకుంటున్నది అసత్యం కాదని తేలింది. అంతే! కెవ్వున గావుకేక వేసి పడిపోయింది.

లోపలినుండి పరుగెత్తుకుంటూ చంద్రమౌళి, వరహాలమ్మా వచ్చారు. అసలేమైందో యిద్దరికీ అర్థంకాక ఆదుర్దాపడుతున్నారు. రాజ్యలక్ష్మి మూర్ఛ పోయిందని మాత్రం చంద్రమౌళి గ్రహించాడు. డాక్టరుకు ఫోన్‌చేశాడు. వరహాలమ్మకు రాజ్యలక్ష్మిని సాధించేందుకు మరో అవకాశం దొరికింది. "లేకపోతే ఆ శవాల పుస్తకాలు చదువుతూ అన్నాలు తినడాలేమిటీ, ఆ సినిమాలు చూడడమేమిటీ ఎన్నడైనా మా కాలంలో విన్నామా? కన్నామా" అని మొదలెట్టింది. డిటెక్టివులు చదవడం, సినిమాలకు వెళ్ళడం కేవలం కలికాల లక్షణాలని వరహాలమ్మ భావం. "అమ్మా నీ సాధింపుకు సమయం సందర్భం అక్కర్లేదా?" బాగా విసుక్కున్నాడు చంద్రమౌళి - అతని మనస్ససలే పరిపరి విధాల పోతోంది.

ఈలోగా డాక్టర్ కామాక్షయ్య వచ్చాడు. రాజ్యలక్ష్మిని పరీక్షచేసి "మరేం భయంలేదు. కేవలం స్పృహ తప్పింది. అంతే - మరో నాలుగైదు నిమిషాల్లో తెలివి వస్తుంది." అని ఓ ఇంజెక్షను ఇచ్చాడు. కామాక్షయ్య చెప్పినట్లే రాజ్యలక్ష్మి ఈ లోకంలోకి వచ్చింది కాని ఆమెలో చైతన్యం ఏ కోశానా లేదు. "ఏమ్మా, ఏం జరిగింది?" ఆదుర్దాగా ప్రశ్నించాడు కామాక్షయ్య.

డాక్టరును చూచేసరికి ఆమెలోని దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహించింది.

"డాక్టరుగారూ." అంటూ భోరున ఏడ్చింది.

"ఏడవకమ్మా - ఏడవకు ఏం జరిగిందో చెప్పు" అన్నా ప్రయోజనం కన్పడలేదు.

"డాక్టరుగారూ నన్ను మీతో తీసుకెళ్ళండి"అని ఏడుస్తున్నది రాజ్యలక్ష్మి.

"అలాగేనమ్మా - పోదాంపద" అని కామాక్షయ్య చంద్రమౌళిని పిలిచి "చూడు చంద్రమౌళీ! అమ్మాయిని నేను ముందు తీసుకుపోయి ఆందోళనకు కారణమేమిటో కనుక్కుంటాను. నువ్వో అర్ధగంట ఆగి రా" అని సూచన ఇచ్చి రాజ్యలక్ష్మితో సహా కార్లో వెళ్ళిపోయాడు కామాక్షయ్య.

క్లినిక్ చేరాక రాజ్యలక్ష్మి చెప్పిన విషయం విని కామాక్షయ్య కూడా ఒక్క క్షణం విస్తుపోయాడు. వెంటనే పరీక్షలు ప్రారంభించాడు.

పరీక్షిస్తున్నకొద్దీ రాజ్యలక్ష్మి దేహ పరిస్థితి మరీ కాంప్లికేటెడ్‌గా కన్పడ సాగింది.

ప్రెవసీ వచ్చిందని తాను ఇదమిత్థంగా తొలి పరీక్షలలో తేల్చుకోలేక పోయినా ఆమె లివర్, లంగ్స్ (ఊపిరితిత్తులు)మామూలు పరిస్థితికన్నా భిన్నంగా వున్నాయని ఊహించాడు.

"చూడమ్మా-నా వెంట ఉస్మానియాకు రా, అక్కడ పరీక్షలు సాగిద్దాం" ప్యూన్‌తో, చంద్రమౌళి వస్తే ఉస్మానియాకు రమ్మని చెప్పమని, తాను రాజ్యలక్ష్మిని అఫ్జల్‌గంజ్ తీసుకుపోయాడు.

కామాక్షయ్య, అతని మిత్రులు రాజ్యలక్ష్మమ్మను పరీక్షచేశారు. వరుసగా నాలుగైదు రకాల పరీక్షలు జరిగాయి. అవసరమైన ఎక్స్‌రే ఫోటోలూ తీశారు.

డాక్టర్ ఖాన్ మాత్రం కామాక్షయ్యతో ఈమెకు కుష్టువు లేదని గట్టిగా వాదించాడు. "క్షయ మాట ఫోటోలు చూచేవరకు చెప్పలేను కాని కుష్టువు మాత్రం రావడానికి వీలులేదు" అని ఖాన్ తన రోగ నిదానాన్ని వివరించాడు.

కామాక్షయ్య కూడా ఖాన్‌తో ఏకీభవించాడు. కాని డాక్టర్ సురేందర్ రెడ్డి, యాదగిర మాత్రం ఈమె ఇస్నోఫీలియాతో క్రానిక్‌గా అవస్థపడుతోందని భావించారు.

"ఈమె రక్తకణాలల్లో చూడండి ఈ లక్షణాలు" అని బ్లడ్ టెస్ట్ ఫలితాలు చూపించారు కామాక్షయ్యకు.

అందరూ ఈమెకు ఇస్నోఫేలియా వుందని ఏకగ్రీవంగా అంగీకరించారు. అయితే ఇది ప్రధాన విషయం కాదుకదా! అసలు టి.బి., లెప్రసీల మాట ఏమయినట్లు??

యాదగిరి కోపంతో అన్నాడు "అసలీ ఇండియా ఖర్మ ఇంతే సార్ - వీళ్ళు మడీ ఆచారాలంటూ ఇష్టంవచ్చినన్నిసార్లు స్నానంచేస్తారు. మాల్‌న్యూట్రీషన్ - ఆరోగ్య సూత్రాలసలే తెలియవు. పైగా చాదస్తాలు - లేకుంటే ఈ జబ్బులన్నీ అమెరికాలోనో ఇంగ్లండులోనో రావెందుకిలా? - మరీ ఇగ్నోరెన్స్ అండర్ డెవలప్డ్ కంట్రీ - నేనసలు స్టేట్స్‌లో ఉన్న కాలంలో...." తక్కిన డాక్టర్లంతా ఇవతలికి వచ్చారు - యాధగిరి తాను స్టేట్స్‌లో వున్న కాలంలోని అనుభవాలు చెప్పడం మొదలుపెడితే కాలండర్ కాగితాలు మారిపోతాయట. ఒకసారి ఒక పేషెంట్‌కు ఆపరేషన్ మొదలుపెట్టి అకస్మాత్తుగా తాను స్టేట్స్‌లో వున్నప్పుడు ఇలాంటి కేసునే ఏం చేయవలసి వచ్చిందో సర్జన్లతో వివరిస్తూవుంటే ఈలోగా పేషెంటు గుడ్లు పెట్టాడట!

ఈలోగా చంద్రమౌళి వచ్చాడు.

"ఏం భయంలేదనీ రాజ్యలక్ష్మికి అన్నివిధాలా పరీక్షలు జరుపుతున్నా" మని కామాక్షయ్యకు ధైర్యంచెప్పాడు. చంద్రమౌళి అన్న రఘువీరరావు పెద్ద డాక్టరు. ఆయనకూ కామాక్షయ్యకు మంచి దోస్తి! అందుకే చంద్రమౌళి అంటే కామాక్షయ్యకు ప్రత్యేక అభిమానం.

డాక్టర్ల ప్రాథమిక పరీక్షల అనంతరం రాజ్యలక్ష్మికి కుష్ఠువ్యాధి రాలేదని తేలింది. కాగా కాలేయాలు, ఊపిరితిత్తులూ కూడా మంచిగానే వున్నాయికాని ఎందుకైనా మంచిది ఒకసారి రాయవెల్లూరు వెళ్ళిరావడం మంచిదని సూచించినాడు సురేందర్‌రెడ్డి.

కామాక్షయ్య మండిపడ్డాడు, "పదిమంది వంటవాళ్ళు కలిసి వంటనంతా తగలేశారన్న సామెత ఇంగ్లీషులో యిందుకే పుట్టింది. లెప్రసీ టెస్టులు పోయాయి - ఇస్నోఫేలియా వచ్చింది-దాని సంగతి తేలలేదు. టి.బి. వచ్చింది- అదీ ఎక్స్‌రేలో ఏమీ కన్పడటంలేదుకదా ఇంకా రాయవెల్లూరు ఎందుకు?"

"ఎందుకంటే ఏం చెప్తాం సార్! వాళ్లు అందులో స్పెషలిష్టులు - వెళ్తే అనుమానం నివారణ అవుతుంది. ఎందుకంటే ఎక్స్‌రేలో కిందిభాగంలో ఏదో ఉన్నట్లు తోస్తోందికదా!"

కామాక్షయ్యకు మళ్ళీ కోపంవచ్చి "అదే సురేందర్! కార్డియాలజిష్టువి నువ్వే యిలా పామరుడిలా మాట్లాడుతావేమిటి? నీ జన్మలో ఎన్నడైనా లంగ్ లోయర్ పార్ట్‌లో యిలాంటి సింప్టమ్స్ (లక్షణాలు) వుంటే టి.బి. అని డయాగ్నయిజ్ (రోగ నిదానం) చేయడం విన్నావా? ఊఁ.... చెప్పు! ఈ కేసు చరిత్రలో ఎన్నడన్నా విన్నావా?"

కామాక్షయ్య దెబ్బలాటకు సురేందర్‌రెడ్డి తగ్గాడు. "నిజమే! టి బి.అప్పర్ పార్ట్‌లోనే వస్తుంది. ఇది ఏదైనా ఇన్‌ఫెక్షన్ అయితే కావచ్చుకూడా! అయినా ముందు జాగ్రత్తగా ఏదో నాకు తోచింది నేను చెప్పాను. తర్వాత మీ యిష్టం."

"ఇష్టంకాదయ్యా - అవతల నష్టం! పేషెంటు అసలు తనకు ట్రెవసీ వుందన్న భయంతోనే హిస్టీరికల్‌గా తయారైంది. కేసును మనం మరీ కాంప్లికేట్ చేస్తే ఎలా?"

'ఓకే. ఓకే.' సురేందర్‌రెడ్డి ఊరుకున్నాడు కాని యాదగిరి మాత్రం ఇలా అన్నాడు అనుమానంగా 'కనీసం ఇస్నోఫేలియాకు, హిస్టీరియాకు ట్రీట్ చేయడం మంచిదికదా!'

కామాక్షయ్య రాజ్యలక్ష్మిని ప్రశ్నించాడు. 'చూడమ్మా నీకేంకూర ఇష్టం!'

'వంకాయ.'

'వింటర్ (శీతాకాలం)లో కూడా వంకాయ తింటుంటారా!'

'అన్ని కాలాల్లోనూ డాక్టరుగారూ.'

'ఇంకేంమరి! శీతాకాలంలో ఇస్నోఫేలియా వస్తుంది వంకాయ తింటే! ఆఁ .. అన్నట్లు ఈ సీజన్‌లో మీకు ఊపిరి పీల్చుకోవడంలో ఏదైనా ట్రబుల్ వుంటుందా?'

'అవునండీ - కొంచె బరువుగా తీస్తాను గాలి - కాస్త మసుకుచేస్తే చాలు ఊపిరి ఆడినట్లుండదు.'

కామాక్షయ్య ఈ లక్షణాలు ఆధారంగా యాదగిరితో చర్చించాడు. 'ఈ మెకు ఆస్త్మా సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బహుశా ఫోటోలో

లోయర్ పార్ట్‌లో ఆ మసక కన్పడడానికి అది కారణం కావచ్చు' అన్నాడు యాదగిరి.

'ఆస్త్మా అని మనం ఎందుకు నిర్ణయించాలి? ఇస్నోఫెలియాలో కూడా ఇలాంటి సింప్టమ్స్ (లక్షణాలు) ఉండవచ్చుకదా!' కామాక్షయ్య వాదించాడు.

'ఇది తర్వాత తేల్చుకోవచ్చు కాని తనకు కుష్టువు వుందన్న భయంతోనే ఈమె హిస్టీరికల్‌గా తయారైంది కదా - ఆ నరాల బలహీనత మాటేమిటి??'

యాదగిరి భయంతో, కామాక్షయ్య ఏకీభవించాడు 'దానిని సైకాలజీ స్పెషలిష్టులతో తర్వాత సంప్రదించవచ్చు' నన్నాడు.

'కాన్పులు ఎక్కువ కావడంతో ఈమె బలహీనపడిపోయి వుండవచ్చు - అందుకని కుటుంబ నియంత్రణ వార్డుకు పంపడం మంచిది' అని సూచించాడు యాదగిరి.

'ఆవిడకింకా బిడ్డలు పుట్టందే!' అన్నాడు కామాక్షయ్య.

'అలా చెప్పండి - అదీ అసలు సంగతి - బిడ్డలు లేరన్న బెంగతో ఆమె హిస్టీరికల్‌గా తయారైంది.'

మొత్తానికి అప్పటికి రాజ్యలక్ష్మికి ఏ వ్యాధి వుందో స్పష్టంగా తెలియని దశలో హాస్పటల్‌నుండి డిశ్చార్జ్ చేయబడి ఇంటికి వచ్చింది.

ఇంటివద్ద వరహాలమ్మ ఒకటే హడావుడి పడిపోతోంది. చంద్రమౌళికి కూడా ఏమి చెప్పాలో తెలియలేదు - 'ప్రస్తుతానికి ఏం జబ్బో తెలియలేదు' అని అనూచే చెప్పాడు చంద్రమౌళి.

'అసలింతకూ పిల్ల ఎందుకు మూర్ఛపోయింది?'

'...............................'

'ఏమిరా అబ్బాయీ....'

'ఏం లేదమ్మా - దానికి కుష్టువు వుందేమోనని అనుమానం వచ్చింది.'

'కుష్టు ...వా.... పెద్దరోగమే!' వరహాలమ్మ గగ్గోలుపెట్టింది - ఇంచు మించు మూర్ఛపోయినంత పని చేసింది.

భార్యసంగతి అయింది, ఇక తల్లిని పేషెంటు నెంబరు 'టూ'గా పంపాల్సి వస్తుందేమోనని భయపడ్డాడు చంద్రమౌళి.

"అమ్మ నాయనోయ్ కొంప మునిగిందిరా తండ్రీ! పెద్దరోగమే ప్రవేశించిందిరా యింట్లో! ఇక మా వంశం గతేమికానురోయ్ నాయినో!"

వరహాలమ్మ ఏడుపుకు పక్క ఇళ్ళవాళ్ళూ కిరాయివాళ్ళూ వీధిని పోయే వాళ్ళు కూడా ఒకసారి తమ దృష్టిని ఇటు మరల్చక తప్పలేదు.

"అమ్మా! అమ్మా! ఊరుకో అమ్మా! మరీ అసభ్యంగా ఏమిటీ రభస! ఎవరైనా వింటే నవ్విపోతాడు."

"నా సంసారమూ బతుకే నవ్వులపాలైందిరోయ్! నాయినోయ్! లేకుంటే ఎన్నడైనా మన వంశ చరిత్రలో ఈ పెద్దరోగం విని ఎరుగుదునూ తండ్రీ! అసలా కాకరాలవారి సంబంధం చేసుకున్నప్పుడే నేననుకున్నాను ఇనపగజ్జెల తల్లి నా కొంపలో అడుగుపెడుతోందని!"

"అమ్మా! ఏమిటిది?"

"ఏమిటిలేదు గీమిటిలేదు! అది ఈ యింట్లోకి రావడానికి వీలులేదు. ఏ సామాను ముట్టడానికి వీలులేదు. దానిని ఏ దవాఖానాలోనన్నా చేర్పించు! లేదా వేరే గది కిరాయికి తీసుకొని అందులో పడెయ్యి."

"హుఁ.... స్వంత అత్తగారే తరిమితే కిరాయికి ఇల్లెవరిస్తారమ్మా ఈ ప్రపంచంలో!"

"ప్రపంచం మాట నాకు తెలీదు. నాకింక ఈ కాకరాలవారి జెష్టతో సంబంధంలేదు. దానికి భరణమిచ్చి పంపెయ్! వేరే సంబంధం రేపీవేళకు చూస్తాను."

చంద్రమౌళి మండిపడ్డాడు తల్లి అగడానికి. బాగా ముఖం వాచేటట్లు చివాట్లు పెట్టాడు ఆమె అతివాగుడుకు, అప్పటికికాని ఆమె ఉద్రుతం కొంత తగ్గలేదు. అయితే ఈ బీభత్సమంతా చూచిన రాజ్యలక్ష్మి మాత్రం కొయ్యబారి పోయింది.

తనకింక ఈ యింట్లోనేకాదు ఈ లోకంలోనే స్థానం లేదని నిశ్చయించు కుంది.

చంద్రమౌళి మెల్లగా తల్లితో రాజ్యలక్ష్మికే జబ్బూ లేదని చెప్పి ఒప్పించ గలిగాడు. కాని రాజ్య లక్ష్మి మాత్రం ఇక సమాధానపడే స్థాయిని దాటిపోయింది.

ఆమె సంతృప్తికోసం గత్యంతరంలేక విశాఖ కింగ్‌జార్జిలో చూపించాడు. అక్కడ చంద్రమౌళి వేలువిడిచిన మేనమామ రామబ్రహ్మం పనిచేస్తున్నాడు.

ఆయన పరీక్షించి రాజ్యలక్ష్మి ఆరోగ్యం స్వచ్ఛంగా, నిర్మలంగా. మానస సరోవరంలా ఉందనీ ఆమె నిర్భయంగా అన్నీ తిని హాయిగా తిరగ వచ్చుననీ చెప్పాడు.

ఆ తర్వాత రాయవెల్లూరు.

అక్కడా కొన్ని నెలల పరీశీలనల అనంతరం రాజ్యలక్ష్మి సంపూర్ణారోగ్యవంతురాలేనని నిర్ధారింపబడింది

సుప్రీంకోర్టు తీర్పులా రాయవెల్లూరు నిర్ణయం వచ్చినా రాజ్యలక్ష్మి మనస్సులో దృఢంగా నాటుకున్న రోగ భయం మాత్రం వదలలేదు. తనకు మొత్తానికి ఏదో ఒక జబ్బు ఉండితీరాలనే ఆమె భావన.

సరే! చివరి మజిలీ ఢిల్లీ యాత్రకూడా చేశారు. ఢిల్లీలోనే చంద్రమౌళి అన్న రఘువీరరావు వున్నాడు.

ఆకస్మాత్తుగా వచ్చిన తమ్ముణ్ణీ మరదలినీ చూచి ఢిల్లీలోని 'ఆసియా 72' చూడడానికి వచ్చారని భావించాడు రఘువీరరావు.

'ఏమమ్మా ఎలావుంది నీ వంట్లో' అని మామూలుగానే ప్రశ్నించాడు.

'ఏం చెప్పను బావగారూ! నా పరిస్థితి రోజు రోజుకూ అయోమయంగా తయారౌతున్నది." అన్నది రాజ్యలక్ష్మి.

"అదేమమ్మా! నీకు ఆరోగ్యం బాగానేఉందని తమ్ముడు జాబు వ్రాశాడే" అన్నాడు రఘువీరరావు.

చంద్రమౌళి జరిగిన చరిత్ర మొత్తం పూసగుచ్చినట్లు చెప్పాడు.

రఘువీరరావు నవ్వి "ఇదుగో చూడు, మనవాళ్ళు ఇంటిగుట్టూ - వ్యాధి రట్టు" అని అన్నారే కాని వ్యాధినిలా మరీ ప్రచారంచేస్తే అరటిచెట్టులా అది రోజూ పిలకలు పెట్టుకొంటూ కొత్త కొత్త రోగాలకిందికి పెరిగిపోతుంది" అన్నాడు.

రఘువీరరావు వైద్యంలో ఎంత నేర్పరో మాటలలో అంత చమత్కారి అని ప్రతీతి. అసలాయన ట్రీట్‌మెంట్ సగానికిపైగా మాటలలోనే వుందట!

రాజ్యలక్ష్మిని పరీక్షచేసి నిజంగానే ఆమెకేజబ్బూ లేదని స్వయంగా నిర్ధారణ చేసుకున్నాడు రఘువీరరావు.

అయితే రాజ్యలక్ష్మికి అనుమానమే!

ఏమంటే రఘువీరరావు కాన్సర్ స్పెషలిష్టు. ఆయనకు అల్సర్స్‌గూర్చి, ఆస్మాగూర్చి, లెప్రసీ, టి బి, ఇస్నోఫిలియాలగూర్చి పూర్తిగా తెలిసి వుంటుందా? రఘువీరరావు రాజ్యలక్ష్మికి ఏ జబ్బూ లేదని ఆత్మవిశ్వాసం కలిగేటట్లు ఎన్నో మార్గాల నచ్చజెప్పాడు. ఎన్నో ప్రమాణాలూ, ఉపపత్తులూ చూపించాడు.

"అయితే ఈ పొడల మాటేమిటి?"

"ఏమిటమ్మా మరీ పసిపిల్లలా మాట్లాడుతావు? ఏ చర్మవ్యాధి వచ్చినా పొడలు రావచ్చు - తామర రావచ్చు. దానికి జాలిమ్‌లోషన్ చాలు. ముప్పావలా మందుతో పోయేదానికి అప్పుడే మూడువేలు తగలేశారు."

"మరీ పెదవులు మొద్దుబారడం."

"చలికాలంలో పెదవులు మొద్దుబారుతాయి - పగులుతాయి - అదీ ఒక జబ్బేనా?"

రాజ్యలక్ష్మికి సంజాయిషీలేవీ సంతృప్తి కల్గించలేదు.

"మరి ఊపిరాడకపోవడం?"

"జలుబు - కేవలం రొంప. పడిశం లక్షణం యిది. కాస్త విక్స్‌వేపరబ్ కాని, అమృతాంజనం కాని పట్టిస్తే సరిపోయేది."

"బావగారూ! ఇదేమీ నాకు ఆత్మవిశ్వాసాన్ని చేకూర్చడంలేదు.!

రఘువీరరావుకూ ఇప్పుడదే సమస్యగా తయారైంది.

ఆమెకు ఏ జబ్బూ లేదంటూ, ఏ మందూ ఇవ్వకుండా పంపిస్తే ఊరుకునేటట్లు కన్పడలేదు. రోగం ఏదో వుందనే బలమైన భావం ఆమె రక్తనాళాల్లో జీర్ణించుకొనిపోయింది.

దానిని ఉపపత్తులతోనూ ఊరడింపులతోనూ తీసివేయడం అసాధ్యం!!

రఘువీరరావు 'సరే'నని ఆమెను తన క్లినిక్‌లో రెండురోజులు రాత్రింబవళ్లు పరిశోధించారు ఆ తర్వాత మరో నాలుగైదు రోజులు వివిధ డాక్టర్లతోనూ స్పెషలిష్టులతోనూ సంప్రదించారు. "అమ్మాయ్! సోమవారం ఉదయం నీగూర్చి నా పరిశోధనా వివరాలు ఇస్తాను" అన్నాడు.

రాజ్యలక్ష్మి, చంద్రమౌళి ఆ సోమవారంకోసం వేయికళ్ళతో ఎదురు చూశారు.

ఆదివారం రాత్రి అసలు రాజ్యలక్ష్మికి నిద్రేపట్టలేదు.

-సోమవారం!

తెల్లవారింది-

రాజ్యలక్ష్మి కాఫీ తాగిన వెంటనే వెళ్ళి బావగారి గదిలో కూర్చున్నది.

ఆయన చాలా బరువుగా నిట్టూర్చి "అమ్మాయ్ - నా తీవ్ర పరిశోధనల వల్ల నీకు జబ్బు వున్నదనే తీర్మానానికి వచ్చాను" అన్నాడు.

రాజ్యలక్ష్మి మనస్సు ఇప్పుడు హంసలా ఈదుతున్నది. పావురంలా ఎగురుతున్నది.

"బావగారూ....బావగారూ...."

"అవునమ్మా! నీకు జబ్బు లేదనడం అబద్ధం. అంతా ఈ విషయంలో పొరపాటుపడ్డారనే చెప్పడానికి విచారిస్తున్నాను."

"చూచారా... చూచారా...." కసితోనూ బాధతోనూ, తనమాటే నెగ్గిందన్న పంతంతోనో రెట్టించి రెట్టించి పలికింది చంద్రమౌళితో.

చంద్రమౌళి - ఏమీ మాట్లాడలేదు-

"అమ్మాయ్ - నీకోసం ప్రత్యేకమైన మందులు తెప్పించాను. "కాంపోజ్" అనే ఔషధం తెప్పించాను. ఇదికాక "అనిటెన్‌సాల్" అనే అత్యాధునికమైన మందు అమెరికా నుండి తెప్పించాను."

"బావగారూ! ఇంతకీ నాకేంజబ్బు?"

"ఇది 'నిరోసిస్' అనే ఒక ప్రత్యేకమైన జబ్బమ్మా! దానివల్లనే ఇలా ఆస్మా, టి.బి., లెప్సర్-ఇస్నో ఫేలియా, టిటనస్ (ధనుర్వాతం) ప్లూ, ఇలా ఎన్నో ఎన్నో వచ్చే అవకాశాలున్నాయి-"

"అయితే బావగారూ! నాకు తగ్గుతుందంటారా?"

"తగ్గనిదే నిన్ను ఢిల్లీనుంచి పంపుతానా తల్లీ!"

రాజ్యలక్ష్మి "హమ్మయ్య" అని నిట్టూర్చింది-

ఇన్నాళ్ళకామె మొదటిసారీగా తృప్తిగా అపూటే భోంచేసింది.

తనకు జబ్బు వుందన్న బావగారి తీర్పు ఆమెకిచ్చినంత తృప్తి, ఇన్ని వందలమంది స్పెషలిష్టుల నిర్ణయాలుకూడా ఆమె కివ్వలేదు.

భార్య కిచన్‌లోకి పోయాక చంద్రమౌళి అన్న ముఖం చూస్తూ వుండి పోయాడు అయోమయంగా!

రఘువీరరావు చిలిపిగా నవ్వాడు.

"అన్నయ్యా .. "

"ఏమిట్రా?"

"ఇదేమిటన్నయ్యా యిలా చెప్పావు?"

"అవునా నేను చెప్పింది నిజమే!"

"అయితే ఆమెకు జబ్బేమిటి? అయినా ఒకే కారణంతో టి.బి., లెప్రసీ, ధనుర్వాతం అన్నీ ఎలావస్తాయి?"

"అవును తమ్ముడూ వస్తాయి - ఎందుకురావు? మనం రమ్మంటే వస్తాయి - వద్దంటే రావు."

"నాకేం బోధపడటంలేదన్నయ్యా! మరీ అయోమయంగా వుంది."

"ఏముంది తమ్ముడూ! మీ ఆవిడకు తనకేదో జబ్బు వుందనే భ్రమ ఒకటి ఏర్పడింది. ఏ రోగ లక్షణాలు చదివితే అవి తనకే ఉన్నాయని భావించే ఒక భ్రమ! మరి ఇలాంటి భ్రమ వుంటే చాలదా, అన్నిజబ్బులూ వచ్చినట్లే, నిజంగా బాధపడటానికి - నేను చెప్పిందీ అదే ఏ జబ్బూ లేకున్నా ఏదో జబ్బు వుందనుకునే జబ్బు ఒకటి రాజ్యలక్ష్మిని ఆవహించింది. 'నిరోసిస్' అని ఓ పేరుకూడా పెట్టాము మేము. కాంపోజ్, అనిటెన్‌సాల్ వంటి మందులూ తతంగమూ అంతా దీనికి మేము జరుపుతాము. ఇదీ కథ." అన్నాడు రఘువీర రావు నవ్వుతూ.